# లిల్లీతో స్నేహం ఏలా అయిందంటే!

"లిల్లీతో నాకు పరిచయం యెట్లా అయిందంటే!" అన్నాడు దామోదరరావు, నేను పందిట్లోకి వచ్చేటప్పటికి.

"దామోదర్రావుగారు ఏమిటో శలవిస్తున్నారే?' అన్నాను.

"వుండరా, నోరుమూసుకు విను" అన్నాడు కుమారస్వామి.

"వింటాను. మొదటినుంచి చెప్ప మను." అన్నాను.

దామోదర్రావు రిటైర్డు స్కూళ్ళ డిప్యూటీ యినస్పెక్టరు. వయస్సులో ఆయన రూపము షోకు తలచుకొని మురిసే ముసలమ్మలు ఇంకా వున్నారు. ఎన్నో కథలు చెప్పుకుంటారు ఆయన సాహస కృత్యాలను గురించి. అందరం కౌసల్య పెళ్ళికి చేరుకున్నాం. మేము గోల చెయ్యగా చెయ్యగా, చెయ్యగా ఆ రాత్రికి రెండు "తెల్లగుర్రాల" బుడ్లు తెప్పించారు పెళ్ళివారు.

అర్ధరాత్రి దేవీపూజకు చేరేము. అంతకుముందే నేను సోడాలకు వెడుతూ "దామోదరరావుగారూ! నేను యీ మధ్య మీ చిన్నతనంలో తీసుకొన్న ట్రయినింగు స్కూలు ఫోటో చూచాను. మీ కోర మీసాలు, మీ కరకు చూపులు, ఏమి గొప్పగా ఉన్నారండీ! చెయ్యి

చూపిన చోటల్లా పంతులమ్మలు చిక్కేరంటే ఒక వింతా? కా ని యిప్పుడు మిమ్మలను చూచి ఆ రూపం ఇమేజిను చేసుకొనుటకూడా కష్టమేనండీ'' అన్నాను.

నీళ్ళు పోసుకోకుండానే ఒక గ్లాసు కొట్టేశాడు.

''ఒరేయి, జాగ్రత్తగా దాచుకున్నానురా, ధనాన్ని గాని, రూపాన్ని గాని, ఆరోగ్యాన్ని గాని, ఈనాడు అర్భకపు వెధవులకు— ఈప్రిస్క్రిప్షనులు, ప్రొహిబిషన్లు, ఈ భయాలు! ఎందుకు పనికొస్తారురా మీరు? అప్పుడు కాదు, ఈనాడు ఛాలన్జి'' అంటూ వుండగా నవ్వుతూ పరుగెత్తాను.

సోడాలు తీసుకొచ్చేటప్పటికి కథ ప్రారంభించాడు.

* * *

'పొన్నమ్మ స్కూళ్ళ ఇనస్పెక్ట్రిస్ డిపార్టుమెంటల్‌గా అక్కడక్కడ కలుసకోడం ద్వారా పరిచయమయింది మాకు. క్యాంపులలో పల్లెటూళ్ళలో తటస్థపడేవాళ్ళం. పట్నాల్లో పలకరించుకున్నది వేరు. కాంపుల్లో ఒకరి సహాయంలేకుండా ఇంకొకరికి గడవదు. ఒకరి దగ్గర స్టౌవ్ లేకపోతే ఇంకొకరి దగ్గర కాఫీపొడి అయిపోతుంది. ఒకరు చక్కెరయిస్తే యింకొకరు దీపమిస్తారు. అట్లానూ.

ఆరోజు మధ్యాహ్నం బస్సుకోసం ఎదురుచూస్తూ ఒకే వట్టి చెట్టుక్రింద నిలుచున్నాము.

''బస్సుల్లో వెళ్లే మనం, రోడ్డు వెంబడి మైళ్ళకు మైళ్ళు నడిచే వాళ్ళ కష్టంగాని, సుఖంగాని, యెరగం కదా? ఇరికి, ఇరికి ఒత్తుకొని కూచుంటాము. ప్రయాణం ఎప్పుడు ఆఖరౌతుందాఅని విసుక్కుంటో. ప్రపంచపు స్వేచ్ఛ వాళ్ళది. ఆడవాళ్ళు, మగవాళ్ళు ఆదివరకు మొహా లెరగని మనుషులుగూడా, స్వచ్ఛమైన గాలిలో నవ్వుతూ ఆనందంగా పరియాచకా లాడుతూ పోతూ వుంటారు. సాయంత్రపు చల్లనిగాలి, ఉదయపు మంచు, మధ్యాహ్నపు పీడల చల్లదనం, ఆ సౌఖ్యాలన్నీ వాళ్ళ సొమ్ము. ఎంత విప్పి మాట్లాడినా, పరియాచకం కిందే తీసుకొని మాటకు మాట అంటిస్తారు అడవాళ్ళు. కాని ఈ ఆఫీసు బెంగలూ, ఆదుర్దాలువుండవు. స్త్రీ అన్నిమైళ్ళు వెంటనడిచి తనతో నవ్వుతున్నా,

మగవాడు అక్రమమైన చనువు తీసుకోడు. తీసుకొనే బుద్ధేకలగదు చదువుకున్న వాళ్ళల్లో, కొత్తవాడు పలకరించగానే. వాడిమాట చెవి మీదకాక, చెయ్యి మీద పడ్డట్లు అదరిపడి, డిఫెన్సులలో వుంటారు ఆడవాళ్ళు. పరిచయ మయిందా అర్థంలేని నమస్కారాలు, సారహీన మయిన డిపార్టుమెంటు కబుర్లు, నిజంగా ఇంట రెస్టులేని వార్తలూ. అవికూడ ఆలోచించి, తూచి, మాట్లాడతారు. సహజంగా కాకులవలె, చీమలవలెకూడా సంభాషించుకోడం మరచేపోయినాము, వెధవబ్రతుకు. సెక్సు ఇంటరెస్టు కలిగినా, సహజంగా కోర్కె తెలియజెయ్యడమూ, నిర్భయంగా నిరాకరించడమూ లేనేలేవు" అన్నాను.

ఆమె చక్కని కళ్ళను వాల్చి మాట్లాడక నుంచుంది.

"అప్పుడే కోపం తెప్పించినట్టున్నాను, నా మాటలతో! చూసేవా, కొంచెం చనువుగా మాట్లాడ నిచ్చినందుకు, అప్పుడే ఎటువంటి సంగతులు మాట్లాడుతున్నాడో! అనుకుంటున్నారు."

"కాదు. మీ మాటల్లోని యదార్థం యోచిస్తున్నాను."

* * *

బస్సులో ఒక్కరూ ఇంగ్లీషు వచ్చిన మొహాలు కనపడేదు. మేము సంభాషణను ఇంగ్లీషులో కన్‌టిన్యూ చేశాము. ప్రేమ, వివాహం, వీటి విషయమై నేను విప్లవోద్దేశ్యాలు కలవాణ్ణని ఆమెకు తెలుసు, కాని తెలీనట్లే నటిస్తోంది. నాకు ఆమె శరీరంకన్న మనసు మీద, ఆమె కారెక్టర్ మీద ఇన్‌టరెస్టు యెక్కువయింది.

* * *

"మీ రిన్ని యేళ్ల జీవించారు. యౌవనమూ, ఆకర్షణా యిక యే ఐదారేళ్లో వుంటాయి. తర్వాత ఉద్యోగమూ, మర్యాదా, అధికారమూ; వుంటాయి. దూరంగా నుంచుని వందల కొలది పూల దండలు భక్తితో వేస్తారు. కాని వేళ్ళు తగిలిస్తో మీ మెడలో పూల దండ వేసి ఆక్రాంత అందాన్ని ఆరాధించడం వుంటుందా? కొందరు, ఎక్కడో ఒక్కరు తృప్తిపొందుతారు అధికారమూ, ఉద్యోగము ద్వారా. తక్కినవా ళ్ళందరికి ఐశ్వర్యమూ. అధికారమూ, సౌంద ర్యమూ, బలమూ, అన్నీ మరియింకో ప్రియతమమైన ప్రాణికి

ఆనందం కలిగించేందుకు సాధనాలే. అట్లాంటి ప్రేమ నెరగని వాళ్లు స్వార్థమనే యినపకవచంలో నివసించా రన్న మాట" అన్నాను.

"నేను యాటీచర్లను ప్రేమిస్తున్నాను. చాలా మందికి సహాయం చేసాను. చదివిస్తాను" అంది.

నాకు తెలుసు. అది ఒక స్వార్థం, అధికారం. వాళ్ళ మీదే ప్రేమవుందా? మిమ్మల్ని, మీ సౌఖ్యాన్ని మరిచి వాళ్ళ ఆనందం మీదిగా చేసుకోగలరా? లోకులమీద యేయోగులకో, ఋషులకో అట్లాంటి ప్రేమ వుంటుం దంటారు. అది ఆదర్శం. కాని సామాన్యులకది ఒక్క సెక్సు ప్రేమలోనూ, దానికి సంబంధించిన పిల్లల మీద ప్రేమ లోనే సాధ్య మవుతుంది. ఆ రెంటినీ యెరగని బ్రతుకు వాన నెరగని యెడారి."

ఆమెకు నామాటలు శూలాలవలె గుచ్చుకున్నాయి. ఆమె అంతరాత్మ తెలీని భాషలో చేసే ఆర్తరవాన్ని నేను తర్జుమా చేసి చెప్పినట్టు తోచిందిగావును.

అందికదా కాని ప్రేమను అనుభవిద్దా మన్నా, పిల్లల్ని ప్రేమించాలి అన్నా, మగవాళ్ళతో సంబంధం అవసరమవుతుంది. చాలా చనువైన సంబంధం, వాళ్ళచేతికి అధికారాన్ని వప్పజెప్పే సంబంధం. ఆ పురుషులా, పశువులు, క్షమించండి."

"ఎట్లా?"

"మీకే స్త్రీతో సంబంధం కలిగితే అధికారం మీది. నాకే అట్లా కలిగితే, అధికారం అతనిదీ"

"ఏమి! అధికారమిస్తేనేం? సర్వమూ ప్రేమించిన వాడి చేతుల్లో పెట్టి, ఆ ఒక్క ఆలింగనంలో తను జీవిస్తున్న సంగతే మరపడంకన్నా స్త్రీకి పరమావధి వుందా?"

"కాని ఔన్నత్యంగల పురుషుడు దొరకవొద్దూ! పెళ్ళి చేసుకొన్నా ననుకోండి. నన్నంటి పెట్టుకొని నాతో తిరగాలి ఆమనిషి. అతని కేం గౌరవ ముంటుంది? నాకు మాత్రం అతని మీద ఏమి గౌరవ ముంటుంది? ఇంకా ఆయన ఇల్లంతా సిగరెట్లు, కుర్చీలనిండా ఇంటినిండా మాసినబట్టలు, ఆయన స్నేహితుల అల్లరి, తగాదాలు,

అప్పుడప్పుడు త్రాగుడు, డబ్బుకోసం పోట్లాటలు, నా మీద అను మానాలు, ఆ జ్ఞాన-పట్టుకుంటే వొదల్తాడా! అందరిముందు చవక చేస్తాడు. బడాయిగా చెప్పుకుంటాడు. నేను తిరగబడ్డానా, నన్ను వొదిలేసి పోతాడు. అంతకన్నా యీ వొంటరిసుఖమే నయం. ఇవి కాక ఇంకా పెద్ద భయాలు మీకు తెలీనివి కావు.''

"వాస్తవమే. మీరు అనుభవంతో మాటాడుతున్నారు. నాది వొట్టి థీయరీ."

"నన్ను వెక్కిరించకండి. నేను చాలా సీరియస్‌గా మాట్లాడు తున్నాను."

కళ్ళలో నీళ్లు కమ్మేయి. జొన్నచేల మధ్యవించి పోతోంది దన్ను. కంకుల నా మొహానికి రాసుకొని, కొత్త చేలను సృజించే పూరణాన్ని నా మొహాన్న చిమ్ముతున్నాయి. ఆ వొంగిన చేల మీద కమ్మిన సాయంత్రపు కాంతి నా హృదయాన్ని కలవర పెడుతోంది.

"పాపం! మీకు తగిన, మీ ఆత్మకు సంతుష్టి నివ్వగలిగిన, అనుభవం అవలంబించాలని మనఃపూర్వకంగా కోరుతున్నాను. అది మరి ఛాన్సో, ఈశ్వరకరుణో, ఎట్లాలబ్బు తోందో మరి!"

"లాభం లేదు. కాలం మించిపోయింది. చిన్న తనపు ఆరోగ్యంలో చిన్న చిన్న గాయాలు లెక్కచెయ్యం. అట్లానే యౌవ్వ నపు ప్రేమలో ఈ లోపాలని లక్ష్యపెట్టక ప్రేమించగలం.

కాని ఇప్పుడు చిన్న నొప్పికాని, చిన్న లోపంగాని, సహిం చడం కష్టమవుతుంది. పరిపూర్ణత లభించదు మానవ మాత్రులకు.''

"కాని మీ రట్లాంటి భయాలతో లోకాన్ని అనుమానంతో చూడకూడదు. గులకరాళ్ళేకదాని కళ్ళు మూసుకుంటే, ఎన్నడో దొరకగల రత్నం లభించే ఛాన్సు పోతుంది."

"ఏమో నాకు ఆశ లేదు. ఏమిటీ! మగవా ళ్ళయినంత మాత్రాన నే నెందుకు విరోధం చూపాలి, అని కొంచెం స్నేహంగా, స్వేచ్ఛగా మాటాడితే, అప్పుడే, అనాడే, విక్టరీ అన్నట్టుగా అనవసరపు విజిట్సు నాకు. తమ మీద ఆ విధంగా ఇష

పడ్డానో లేదో తెలుసుకోగల విచక్షణ లేదు. పెద్ద పొట్టలు వేసికొని, పొడుం పీల్చుకుంటో వెకిలి చూపులతో, మాటలతో తయారు..........

"ఏదీ, మీ ఫోటో వుందా?"

"ఈసారి క్యాంపు ఎక్కడ!"

'ఇంట్లో మీ రొక్కరేనా?" అని అడుగుతో వుంటే నా స్లిప్పరు తీసి మొహంమీద విసిరివెయ్యాలని వుంటుంది.

నాకే మొగవాడు కావలిస్తే, పనిచేసే చాకలివాడు, ప్యూన్ నయం వీళ్ళకంటె. పెద్ద అద్దం వాళ్ళముందు పెట్టి చూసుకోండి, మీ అందం అనాలనిపిస్తుంది.

"రాత్రి ఎన్నింటికి పడుకుంటారు! ఒకవేళ నిద్రపట్టకపోతే యిట్లా వస్తా. సినిమాకు వస్తారా?' అని కొందరు.

నేను కొన్నాళ్ళు పెయింట్ చేశాను. అందువలన శరీరం వొంపులు చప్పున గుర్తుపట్టగలను. ఠీవిగా, గంభీరంగా వేసుకొన్న ఆ సర్జి లాంగ్ కోట్ల క్రింద ఏముంటుందో? చలవమడతలూ పట్టుసూట్లూ ఏం దాస్తాయో!

ఇంక యౌవనులు, కొత్తగా ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి ప్యాసైనవాళ్లూ, ఈ కవులూ, కథకులూ వస్తారు. మా అక్క కొడుకు పార్వతీశం తీసుకొచ్చేవాడు. వాళ్ళ మాటలు ఎంతసేపూ ఈమిస్, ఆమిస్, అందరూ తమని ప్రేమించడమే, తామే వెనుతియ్యడం. ఆమిస్లు ఎవరంటారు? లక్షాధికార్ల కూతుళ్ళు, దివానుల కుటుంబం వాళ్ళు, ఇంగ్లీషుకన్యలు, నర్సులు. మరి అంత గొప్ప పిల్లలు తమని ప్రేమిస్తూవుంటే, సుఖంగా వాళ్ళని పెళ్ళిచేసుకోక ఈ గుమాస్తాపనులకి ప్రయత్నాలెందుకో తెలీదు.

"నేనండి, శ్యామలా చటర్జీని కలిసికొని మాట్లాడాను, యీ మూవ్మెంటును గురించి అంటారు: ఏ శ్యామలా! ఆక్స్ఫర్డ్లో అరేళ్ళు చదివి, ఇప్పుడు మూవ్మెంటులో జైలుకు వెళ్ళిన నాయకురాల్ని గురించి! 'అమె నన్ను చూచి వదలదండీ. నా సెక్రటరీగా వుండు' అని చాలా ప్రేమతో చెయ్యి పట్టుకుందట! వాడి మొహం చూడవలసింది మీరు! ఇన్ని దేశాలు తిరిగి, రోజుకు ఇంతమందిని

చూపే ఆమెకి, లోకం కొల్లబోయి, మా చుంచుమొహంవాడే దొరికే డట! ఏం అహంభావా లంటారు? వీళ్ళ తాహతు? సెన్స్ అఫ్ ప్రపోర్షన్ పోతుంది వీళ్ళకి.''

ఆమె మాటలు వింటే నాకు భయం వేసింది. ఇంత విచక్షణా, స్వతంత్రమూ, ఆమెలో వున్నాయనుకోలేదు. నా మామూలు మాటలలో స్త్రీ యౌవనమూ కోర్కా ప్రాతివ్యత్యం మాట్లాడి తబ్బిబ్బుచేసి తమాషా చూద్దామనుకున్నాను.

అదృష్టవశాత్తు ఎన్ని గారెలు తిన్నా, నాకు బొర్ర రాలేదు. వచ్చి వుంటే బస్సులోంచి దూకి పారిపోదును.

''మాట్లాడరేం?''

''ఏమీ తోచటం లేదు.''

'మిమ్మల్ని అంటున్నా ననుకున్నారా?''

షర్టు కింద చూచుకున్నాను.

''మొన్న ఇద్దరు ప్లీడర్లండీ, పక్క కంపార్టుమెంటులో ఎక్కారు.''

ఎవరూ లేరురా ఇంట్రడ్యూస్ చెయ్యడానికి అంటారు. ఇంట్రడ్యూస్ చెయ్యడం, రావడం, నాతో కూచోడం, జయించడం.... అట్లా వుంటుంది ధోరణి

''ఇంక తిట్టకండీ మొగవాళ్ళని.''

''మిమ్మల్ని కాదండీ!''

''నేనూ అందరిలాంటివాణ్నే.''

'కాదనుకునే మాట్లాడుతున్నాను. పొరబడ్డానేమో!''

''ఏమైతేనేం! పురుషరక్తమే!''

''మీరు వేరని నా నమ్మకం. అందుకనే ఇంత దూరం మాట్లాడాను. ఇట్లా మాట్లాడి నా మనస్సు కనుక్కోవాలనే మొదలు పెట్టేరు. అవునా? చెప్పుకోండి.''

''నిజ మేమిటి?'' అని ప్రశ్నించుకున్నాను.

''మొదట ఆ ఉద్దేశ్యం లేదుకాని, పూర్తిగా లేదనటం నిజం కాదు.''

కథా నిలయం
137
శ్రీకాకుళం

"ఎక్స్‌పెరిమెంట్ చేద్దామా?"

"ఏమిటి?"

"ప్రేమ."

"ఊఁ"

"కాని అదే బంధ మవుతుందని భయం. అది మన స్వభావంలోనే ఉన్నది. హృదయాన్ని అర్పించకుండా అనుభవిస్తే ఆనందం లేదు. హృదయాన్నిస్తే బానిసత్వం, విరహం, ఈ బాధలన్నీ వెంటనే వస్తాయి."

"కాదు. నేను బంధం కానీను."

"మీ రా మాట అంటే అప్పుడే నాకు బాధ-యింత త్వరగా తప్పుకోగలవాడు నన్నేం ప్రేమిస్తున్నాడని చూశారా!"

బస్సాగుతోంది.

"మా యింటికి రండి త్వరలో. తక్కింది మాట్లాడుకుందాం. విజిట్ అనుకోనులెండి."

మొదటినుంచీ కూడా మా సంబంధం స్కాండల్ కాకుండా చాలా జాగ్రత్తపడ్డది పొన్నమ్మ. నన్ను చాలా జాగ్రత్తగా ఉండమని బ్రతిమాలేది.

"మీరు చెప్పే స్వేచ్ఛలో ఉండే ఆనందం నే నెరక్కపోలేదు. కాని ఆ ఆనందంకన్న పనిలేనివాళ్ళ ఆక్షేపణలూ, నీచపు మాటలూ, చాలా కష్టాల్ని తీసుకొచ్చి, మన ప్రేమనే నీచంగా చూపిస్తాయి. బాధలు, తిట్లూ అనుభవించి ప్రపంచాన్ని సంస్కరింపవలసిన ధీరులు అవసరమని ఒప్పుకుంటున్నాను. కాని నే నట్లాంటి ధీరురాల్ని కావాలని నాకేమీ కోర్కెలేదు. ఒక్కమాట ఎవరైనా నన్నంటే వారంరోజులు బాధపడి, ఆ వూరు విడిచి పారిపోతాను" అన్నది.

* * *

ఆర్నెల్లయింది. మా ఎక్స్‌పెరిమెంటు పూర్తి అయ్యే కాలం వచ్చిందని తోస్తుంది. కాని నాకు చెప్పటానికి ధైర్యం చాలటంలేదు. ఆమెకు చాలా బాధ కలుగుతుందని తెలుసు. ఆమె మనసులో ఎంత

ఉత్సాహ మున్నా, శరీరం తిరగబడుతోంది. ఇన్నాళ్ళు నిర్లక్ష్యం పొందిన కసిని శరీరం ఈనాడు తీర్చుకుంటోంది.

ఓ ఉదయం నా ఆఫీసులోకి ఇరవై యేళ్ళ అమ్మాయి వచ్చింది.

"ఎవరు?"

"నా పేరండి లిల్లీ"

కొంచెం సేపు ఆమె అందం చూస్తూ ఉండిపోయాను. హంపిలో విగ్రహాలకు చూశాను, అనవసము అందం. యెదురుగా, ముందుకి భారంతో కళ్ళని బెదిరించే రొమ్ము, విశాలమై బలువైన మొల. చిన్నవాళ్ళకి పీలపున వొడ్డున తెల్లని యిసుక బయలు చూస్తే యెట్లావుంటుంది, నా చూపులకి ఆ సంతోషా నిచ్చింది ఆజఘనము. పల్లెటూరి పనులతో చక్కని వొంపు లేర్పడి, ఎంతైనా ఆలవని కండరపు తాళ్ళతో బిగించి వుంది ఆ తొడల పై భాగమంతా. ఈగ వాలినా జారిపోతుంది. దుమ్ము వలుకైనా చెదిరిపోతుంది. అద్దంమీదపడ్డ కాంతిలాగ, లేడి చర్మంమీద వలె. ఒక్కసారి నా తలను ఆమె రెండు స్తనాల మధ్య వొత్తుకోగలిగితే! ఇవన్నీ ప్రతి నిమిషానా నాకు కలిగే సామాన్య వికారా లనుకోకండి. కాని ఆమె అందం అటువంటిది. నేననుభవించిన అందం కనక, ఏమాత్రం నా మనసు భ్రమపడలేదని చెప్పగలను.

ఏం అంత అందాన్ని చూసి మాత్రం దుర్మార్గపు ఆలోచనలు రావొచ్చునా అనుకొని పెదవి విరుస్తారు మీరు. మీకు రావా; నిజం చెప్పండి" అంటున్నాను నేను. "రావు" అని అంటారా, మిమ్మల్ని చూస్తే చాలా జాలిపడతాను. జాలికి రెండు మూడు కారణాలున్నాయి: దాంట్లో ఏకారణంవల్ల మీరంత పవిత్రులైనారా అని ఆలోచించుకుంటున్నాను.

ఆలోచనలు వచ్చినా, మేము ఏదో మరచిపోతాము కాని అనుభవిస్తామా అంటారు. నాకు లభ్యమయింది కనక అనుభవించాను. మీకూ లేదు. అదృష్టాల బేధంతప్ప, నీతిబేధంకాదు, పవిత్రవంతులైన మీకూ, పాపాత్ముడి నైన నాకూ.

ఆ చీరకిందనుంచి కనపడుతోంది పొట్టకింద మసుపూ,

చదువూ, జారుడూ! మెత్తని, ఆ గచ్చుని, వేళ్ళతో మెల్లిగా రాయ గలిగితేనా? కొంతసేపు తేరిపార చూస్తో కూచున్నాను మాట్లాడక.

"ఏమిటి?"

"నా ఉద్యోగం పోయింది, నేను టీచర్ని. నామీద నిందలు వ్రాసి, గిట్టనివాళ్ళు తీయించేశారు."

"నన్నేమి చెయమంటావు?"

"తమదయ"

"ఏమిటి నాదయ! నే నేం చెయ్యను?"

"అమ్మగారితో తమరు చెపితే?"

"ఏ అమ్మగారూ?"

"ఇన్‌స్పెక్టరు దొరసానిగారు"

"ఆమేనా తీసేసింది?"

"ఆమే మా మానేజరుచేత తీయించేశారు."

"నేను చెపితే ఆమె యెందుకు వింటుంది?"

"ఆమె నెరుగుదురు కదా!"

"ఎరిగివుంటే మాత్రం?"

మాట్లాడలేదు.

మారహస్యం వెళ్ళడయిందా?

"నాకు తెలీదు వెళ్ళు."

కన్నీళ్ళు పెటుకుంటో నుంచుంది.

"ఏమని అర్జీ పెట్టేరు నీమీద?"

"నానడత మంచిది కాదని."

"మంచిదేనా?" నవ్వాను.

"ఏం చెప్పను?" అంది.

అవినీతికి తీసివేసిందా, పొన్నమ్మ!

"నేను చెప్పితే ఆమె వింటుందా?"

"వింటారండి. నాకు తెలుసు."

"ఏం తెలుసు?"

"తెలుసులెండి" అంది చిరునవ్వుతో.

"తెలిస్తే యింకేం! మరి నీకు పని యిప్పిస్తే నాకేమిస్తావు?"

"నే నే మివ్వగలనండి?"

"ఇవ్వగలిగినదే."

"ఇస్తాను."

"మాట తప్పవుగదా?"

"తప్పను."

సాయంత్రం పొన్నమ్మ దగ్గరికి తీసుకువేళ్ళేను. "ఏమిటి, లిల్లీ నీ కెట్లా తెలుసు? అంది ఇంగ్లీషులో. ఇంగ్లీషులోనే మాట్లాడుకున్నాము.

"నా దగరకు వొచ్చింది. పాపం! పని తీసేశావుటగా."

"కారణంకూడా చెప్పలేదా. లిల్లీ నీతో?"

"చెప్పింది. కాని ఆకారణం నీకు కోపం తెప్పించిందా? న్యాయంగా తోచిందా?"

"ఏం చెయ్యను, పిటీషన్లు వస్తే?"

"కాని నీకు యిష్టంలేకపోతే, నువ్వు నమ్మవలసిన అవసరమేముంటుంది"

"కాని చూడు! అదేం టీచరు? ఎన్నాళ్ళు పని చేస్తుంది. అట్లాంటిదాన్ని బోధనలకు పసిపిల్లల్ని ఎట్లా వప్పచెప్పగలము?"

"నువ్వు కూడా అట్లా అంటే?"

నేనుకూడానా? అంటే అర్ధమేమిటి?"

"నువ్వే యోచించుకో"

ఆమెకి కోపంవొచ్చింది.

"నేను మొదట్లోనే చెప్పలేదూ? మగవాళ్ళకు హక్కుల్ని చ్చేసూ, చవకై పోతామని. చదువుకున్న వాళ్ళం యోచించి, మనసు కలుపుకున్న మనకీ, యీ పశువులకీ—"

"సరే మనం వాదించుకుందాంగాని, ముందు ఆమెని పంపెయి"

"పొమ్మను"

"ఉద్యోగ మిస్తానను"

"ఒల్లేను, నిశ్చయం"

ల్లిని వెళ్ళమన్నాను. వెళ్ళింది.

మాట్లాడకుండా కూచున్నాము.

"భర్తలున్న స్త్రీలు ఎందుకు పురుషులతో వెడతారో నాకు అర్థంకాదు. కావలసింది దేహసౌఖ్యం. అది తీరితే ఇంకేం అవసరం?" అంది.

"కాదు. అనేక కారణాలున్నాయి. మగవాడు స్త్రీని కోరడమో?"

"అదీ నా కర్థం కాదు,"

"రోజూ గోంగూరపచ్చడి తింటే యెట్లా వుంటుంది? భార్య అన్నం. అది మామూలు. అది లేంది భోజనం లేదు. తక్కిన వ్యవహారాలు ఆదరువులు. అవి లేంది అన్నం రుచించదు. వాటి సహాయ తో ఎక్కువ అన్నం తింటాం. అవి భార్యలు గుర్తించరు."

"చిరుతిండి మరిగి అసలు అన్నం తినడం మానేసే వారూ లేరూ?"

"వారు అవివేకులు. చిన్న పిల్లలు చేసేపని అది. వాళ్ళకి అజీర్ణం తప్పదు."

"ఆడదానికి?"

"ఆడదానికి వేరు—కొందరికి తప్ప."

"ఏమో?"

"స్త్రీ విషయంలో ఎక్కువ కష్టా లున్నాయి."

"ఎవరు తెచ్చిపెట్టినవి?"

"సంఘం."

"అంటే పురుషులు".

"కావచ్చు ను కాని బాధలు, సమస్యలు ఎక్కువైన మాట నిజం. కారణ మేమైతేనేం. అదిగాక నాకరికత లేని వాళ్ళ వుత్త అన్నం తిని తృప్తిపడగలరు. చాలమంది స్త్రీలు ఇంకా నాగరికత పొందనేలేదు. కొద్దిమందికే వివిధ రుచులమీద ఆశ వుంది. అట్లాంటి వాళ్ళని అనుభవించనీ, అందువల్ల సంఘమూ భర్తా కలిగించే బాధలన్నీ పడనీ."

"మొతానికి భర్తలు ఉన్న స్త్రీలు ఇతర పురుషులను వాంఛించడం క్షమించదగిన పనిగాదు."

"లిల్లీకి పెళ్ళయిందా?"

"ఆ"

ఆరాత్రికి ఇంకేమీ మాట్లాడడానికి నాకు బుద్ధి పుట్టలేదు. ఇంటికి వెళ్ళేటప్పటికి లిల్లీ నాకోసం కాసుకునివుంది.

"లిల్లీ, నీకు పెళ్ళి అయిందట కదా?"

"అయింది, కాని ఆయనకూ నాకూ సంబంధంలేదు."

"ఆయన ఎక్కడ వున్నాడు?"

"నా యింటోనే కాని సంబంధంలేదు....ఏమన్నారండీ?"

"ఆమె నామాట వినడంలేదు."

"నాకు వుద్యోగం లేకపోతే మళ్ళీ ఆయనచేతుల్లో చిక్కాలి."

"ఏం, చిక్కితే?"

"అంతకన్న చస్తే మంచిది."

"ఏమి లోపం?"

"ఎట్లా చెప్పనండీ? నాకు చేతకాదు"

"పోనీలే, కాని ఇట్లాంటి అపవాదులు ఎందుకు తెచ్చుకున్నావు?"

"నాకు గిట్టనివాళ్ళు"

"విరోధాలెందుకు వొచ్చాయి?"

"చూడండి. నాదీ మానవశరీరం. ఎవరిమీదో ఎందుకో యిష్టం వస్తుంది. అందువల్ల ప్రతివాడు తనమీద ఎందుకు యిష్టపడకూడదంటే, సాధ్యమా? అట్లా అంటే కోపాలు."

"నేనడిగితే!" అన్నాను సాహసించి.

"మీరా?" అని సిగ్గుపడుతూ దగ్గిరకొచ్చింది.

కుర్చీమీద కూర్చున్న నేను, ఆమె పిరుదులను చేతులతో కౌగలించుకుని, నాతలని ఆమె నున్నని పొట్టక్రింద ఆనించాను.... తెల్లవారుతోంది. లిల్లీ నా బుజాల మీద తలపెట్టుకొని కూచుంది. నే నాలోచించుకుంటున్నాను, ఇట్లాంటి సౌఖ్యాన్ని యిన్నేళ్ళు యెందుకు ఎరగకుండా మిస్‌ఐనానాఅని? ఇంక ఏ పదేళ్లో మిగిలింది జీవితం, యిల్లాంటి ఆనందాలకి. ఈ పదేళ్ళలో ఒక్కరోజు వృథా

చేరానా, నా అంత మూర్ఖుడుండడు. మొగవాడి ఉద్రేకపు కామానికి తీపి పోక ఎదురు కామం ఇవ్వడానికి సృజించేరు ఆమె జఘనాన్ని మన్మద ప్రభృతులు. రంభ అంటే యిదేకావును. అస్వప్నం!

"లిల్లీ!"

"ఏమండీ....మాట్లాడరేం? ఎందుకు పిలిచేరు?"

"ఏమీలేదు"

"చెప్పండి"

"నువ్వు నల్లకలువవి. కలవలన్నిటిలోకీ శ్రేష్ఠమైనది, విశాలమైనది, సువాసనకలది, దేవతలచేత ప్రేమింప బడినది గంగానదీ సరోవరాలలో పుడుతుందని ప్రతీతి కలదు."

పకపక నవ్వింది. ఆమెరొమ్ము కదలిక చూసి పరవశుడనై మళ్ళీ ఆమెను ఆలింగనంలో అనుభవించాను.

* * *

నేను క్షవరం చేసుకుంటున్నాను.

"ఏమండీ, నాపని సంగతి?"

యింకా పని జ్ఞాపకముందా?"

"పనీ, భోజనమూ, జీతమూ యిట్లాంటి శుష్క-ప్రయోజనాలతో మన కేం పని?"

"ఇవ్వాళ ఆఫీసుకు వెడతారా?"

"ఆ, తప్పదు"

"నన్ను కూడా స్కూలుకు పంపండి"

"ఎంత చమత్కారివి?.... నిన్ను వదలను"

"నే నిక్కడినుంచి కదలను"

"నిజంగా యిష్టమా నామీద? అని నా పురుష అహం భావం అడిగింది.

"అవును"

"మరి నాతోనే వుంటావా!"

"నిజంగా వుంచుకుంటారా?"

వచ్చేను. ఆమె ఒప్పుకోదనే ధైర్యంతో ఆప్రశ్న వేశాను.

"మరి నీ పని?"
"మీదగ్గరే వుంటే నాకు పని ఎందుకు?"
"అట్లాకాదు. 'వుద్యోగం పురుష లక్షణం!' వచ్చే పని మానేస్తే ఎట్లా!"
"సరే! యిప్పించండి"
మళ్ళీ బాధపడ్డాను. నన్ను వొదలిపోవాలంటే చింతకనపర్చదే!
"ఆమె యివ్వదు"
"మీరు చెప్పితే, బెదిరిస్తే, యిస్తారు."
"ఏమని బెదిరించను?"
"మీకే తెలుసు"
ఎంత తెలివికలదానివి, లిలీ!
"అట్లాకాదులే. ఆమెతో ఎందుకుగాని చైరుమన్‌గారితో చెప్పి యీవూళ్ళోనే యిప్పిస్తాలే"
"ఎప్పుడు?"
"యీ వేళ వెడతాను. నువ్వు మీ బంధువులయింట్లో వుండు. సాయంత్రం వస్తావా?"
"రాత్రంతా ఏమైనావని అడుగుతారు గావును వాళ్ళు"
"పని ప్రయత్నంలో వున్నానను.
"అర్ధరాత్రా! అంటారు? సరేలెండి"
మూడోరోజుకు లిలీకి అవూళ్లోనే హెడ్‌మిస్ట్రెస్సు పని అయింది. డబుల్—స్కూల్లోనూ, నా యింట్లోనూ! పొన్నమ్మ నాకు కబురంపించింది.
"చాలా పనిగా వున్నట్టున్నారే! దర్శనమే లేదు."
"అవును వచ్చి చెప్పాలనుకుంటున్నాను"
'EXPeriment of...F!
"లిల్లీ ఏనా కొత్త EXperiment?"
"ఏమైతేనేం?"
"దాని వుద్యోగం మళ్ళీ వూడుతుంది"
"వూడితే నాతోనే వుంటుంది" అని వచ్చేశాను.

సాయంత్రం చైరుమెన్ కబురంపేడు నాకు,

"ఇదేమిటయ్యా? యీ యినస్పెక్ట్రిస్సు లిల్లీ ఉద్యోగానికి అభ్యంతర పెడుతోంది"

"ఆ అభ్యంతరాలకేం లెండి, మీరు తలచుకుంటే"

"మీకు చాలా యింటరెస్టుందే!"

"ఏదో కూడు లేనివాళ్ళు పాపం"

రాత్రి లిల్లీ రాలేదు. తల నొప్పిగావుందని కబురంపింది. కొత్తలో—మోహపుకొత్తలో—వస్తానన్న మనిషి రాకపోతే ఎంత బాధపడతామో, ఏలాంటి సాహసపు పనులు చేస్తామో అందరికి తెలిసిన విషయమే!

మనసు పట్టలేక లిల్లీయింటికి వెళ్ళేను.

తల నొప్పిగా ఉన్నా పక్కన కూచుని ఆమెను, బాధతో మూసుకున్న ఆమె కళ్ళను చూస్తు, ఆమె చెంపలు, నడుము, రాస్తో కూచోడమే ఆనందం.

లిల్లీ లే దింట్లో. సిగ్గును చంపుకొని దరియాప్తుచేశాను. చైర్ మెన్‌గారి యింటికి వెళ్ళిందట, యింకా రాలేదు.

"ఇంత పొద్దుపోయినదాకానా?"

"కొత్తలో యిక్కడే పడుకునేది. ఈ మధ్య పదిరోజుల నుంచి రాత్రు లేమవుతోందో ఎవరికీ తెలీదు. ఏమోనండి! ఈ గది లోంచి పొమ్మనాలని చూస్తున్నాము"

"అవును మీవంటి మర్యాదస్తులు వుపేక్షించవలసిన విషయం గాదు. ఎప్పుడొస్తుం దంటారు?"

"ఏమో?"

పక్క గుడిసెలోంచి ఒకడు-

"చైర్మనుగా రింటికి సాయంత్రం ఆడదివెడితే పొద్దునే రావడం." అన్నాడు.

"మరి యింటిదగ్గర ఆయన ఆడవాళ్ళు ఊరుకుంటారా?"

"ఇంటికి కాదండి. రహదారి బంగళాలో చేరుకుంటారు, ముతా అంతా."

బంగళాకు పోయినాను. నా వుద్దేశ్యమేమిటో నాకే తెలీదు.

"చైర్మన్నుగా రున్నారా?"

"లేరు"

"వున్నారని తెలుసు నాకు. యినస్పెక్టరుగారు వొచ్చేరు, అవసరంగా మాట్లాడా లని చెప్పు."

"ఏమంటారో?"

"చెప్పు, వీల్లేదంటే పోతాను."

బైటకు వొచ్చేడు చైర్మను. చాలా కులాసాగా వున్నాడు. బ్రాందీ మహత్యంవల్ల.

"ఏం బ్రదర్, ఏమిటా అర్జంట్? తొందరగా కానీ."

"లిల్లీ వుందా? ఏం చేస్తోంది?"

"ఉద్యోగం సంపాదించుకుంటోంది."

———